పోతే పోనీ.. "మానం.. ప్రాణం..!"

చదువుల తల్లి ఒడి ఓ పూవనం. బాల్యం అక్కడ వికసించాలి. అందినంత విశ్వజ్ఞానం మస్తిష్కంలో నిక్షిప్తం చేసుకుని.. అంతరిక్షం వరకూ అల్లుకోవాలి. తన సన్నిధిలో బిడ్డల ఎదుగుదల చూసి.. వాగ్దేవి పరవశించి పోవాలి. గురువుల గుండెలు ఉప్పొంగాలి. కానీ పూ వనంలో పురుగులు పడ్డాయి. లేత హృదయాలను తొలిచి.. మొగ్గ దశలోనే చిదిమేస్తున్నాయి.

ఉరి తాళ్లకు వేలాడుతూ కొన్ని.. ఆకాశ హర్మ్యాల నుంచి అమాంతం దూకేసి మరికొన్ని.. కళ్లెదుటే రాలిపోతున్నాయి. ఆత్మహత్యలు అని నిఘంటువులో ఉన్నా.. కాదు.. హత్యలు అని పగిలిన గుండెలు అంటున్నాయి. చరణ్..! బాగా చదివి బాగుపడతావని అమ్మా, నాన్న కలలుగంటే.. ఇలా రాలిపోయావేమిటి..? ఒక్కక్షణం ఆలోచించి.. ఆగిపోకూడదా కన్నా..!



కాలేజీలలో కర్కశ మూకలు.. ఫీజుల పేరిట నిత్యం వేధింపులు

అనంతపురం విద్య, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యాపారం ఏదైనా.. లాభనష్టాలు ఉంటాయి. కానీ చదువుల వ్యాపారానికి ఇది వర్తించదు. అందుకే, ఎవరుపడితే వారు, ఎలా పడితే అలా విద్యాసంస్థలను నడుపుతున్నారు. నాణ్యమైన చదువు అందుతుందని భావించి, కార్పొరేట్ వలలో తల్లిదండ్రులు చిక్కుతున్నారు. అక్కడి ఖర్చులను అంచనా వేయలేక, పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. అక్కడ చదివితే తమ బిడ్డల భవిష్యత్తు బంగారం అవుతుందని అపోహలకు పోతున్నారు. అడ్మిషన్ సమయంలో తియ్య తియ్యని మాటల వెనుక కర్కశత్వాన్ని అంచనా వేయలేకున్నారు. 'నిర్భయంగా వదిలి వెళ్లండి సార్.. నేనున్నాను కదా..! మంచి రూము, కావాల్సిన కాట్ చూపిస్తాను. ఫోన్ చేయండి.. మీవాడితో నేను మాట్లాడిస్తాను..' అని వల విసురుతారు. ఆ తరువాతే అసలు కథ మొదలౌతుంది. తల్లిదండ్రులు అడ్వాన్సు ఓ రూ.50 వేలు కట్టి వెళ్లంటారు. ఇంకో యాభై కడితే పనైపోతుందని అనుకుంటారు. కానీ మొదట కట్టిన సొమ్ము జాబితాలో కనిపించదు. దోబీ, డిపాజిట్, మెటీరియల్, ఎగ్జామ్.. ఇలా 'హిడెన్ చార్జీల' చిట్టా విప్పుతారు. అది మొదలు.. దందా మొదలౌతుంది. ఎంత కట్టినా, ఎన్నిసార్లు కట్టినా.. ఫీజు ఖాతా చిల్లు కుండ నిండనే నిండదు. ఆరోగ్యం బాగలేకనో, పండుగకో, పబ్బానికో హాస్టల్ నుంచి కాలు బయటపెడితే.. తిరిగి వెళ్లే రోజు టోల్ గేట్ పడుతుంది. గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే అమానవీయంగా వ్యవహరిస్తారు. నువ్వు ఎంత పెద్ద తోపైనా కావచ్చు..! పిల్లోడిని, పాపను నిలబెట్టేస్తారు. మొదటి రోజు మాయమాటలు చెప్పినోడు అక్కడ ఉండడు. ఫోన్ చేసినా ఎత్తడు..! టోల్ చిట్టా పట్టుకున్న ద్వారకింకరుడు హుంకరిస్తాడు. కన్నీటి వేడుకోలుకు అక్కడ కరిగేవాడు ఉండడు. మచ్చుకైనా కనిపించడు.. మానవత్వం ఉన్నవాడు. నగర శివారు కాలేజీలో చరణ్ కావచ్చు.. మరొకరు కావచ్చు..! రాలిపోయే ప్రతి పసిమొగ్గ వెనుక విషపు కత్తుల వేటు ఉంటుందన్నది బహిరంగ రహస్యం..!

- అడ్మిషన్ సమయంలో ఊరించే మాటలు
- ఆ తరువాత అవమానాలు.. బెదిరింపులు
- పర్యవేక్షణ మరిచిన ఆర్ఐఓ, అధికారులు

కుప్పలు తెప్పలు

జిల్లా వ్యాప్తంగా 88 ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. నారాయణ, శ్రీచైతన్య, నలంద, ఎస్ఆర్ జూనియర్ కళాశాలలు, వివేకానంద, శ్రీసాయి విద్యాసంస్థలు, మాస్టర్స్, కాగ్నిజెంట్, శ్రీమేధ, ఎన్ఆర్ఐ, తేజ.. ఇలా అనేక కళాశాలలు ఉన్నాయి. కొన్ని కార్పొరేట్ కళాశాలలు ఇష్టారాజ్యంగా బ్రాంచులను నడిపిస్తున్నాయి. వేలాదిగా వచ్చే అడ్మిషన్లు పట్టక, బాలబాలికలకు వేర్వేరు క్యాంపస్‌లు పెట్టి నడుపుతున్నాయి. రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్, డే స్కాలర్.. ఇలా కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. చాలావాటిలో నిబంధనలు మచ్చుకూ కనిపించవు. ఇరుకు గదులు, ఎలాంటి రక్షణ లేని భవంతులను లీజ్‌కు తీసుకుని విద్యార్థులను కుక్కేస్తున్నారు. రెండు బ్రాంచులకు అనుమతి తీసుకుని.. అదనంగా మరో రెండు నడుపుతున్నారు. అదనపు సెక్షన్‌లనూ నడిపిస్తున్నారు. కొన్ని కాలేజీలలో విద్యార్థుల సంఖ్య వేలల్లో ఉంటుంది. ఇంత మందికి వసతుల కల్పన సాధ్యంకాదని తెలిసినా.. ధనదాహంతో చేర్చుకుంటున్నారు. స్నానపు గదులు, టాయిలెట్లు, బెడ్లు.. ఇలా అన్నింటిలోనూ సర్దుకోవాల్సిందే.



విద్యార్థులు హాస్టల్ లోపలికి వెళ్లే వరకే తల్లిదండ్రుల చేతిలో ఉంటుంది. ఆ తరువాత శిక్షాకాలం ముగిసేదాకా వారి చేతిలో ఏదీ ఉండదు. అడిగిన ప్రతిసారీ, అడిగినంత డబ్బులు కట్టడం తప్ప..! నాలుగు గోడల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నా.. అడిగే దిక్కుండదు. తల్లిదండ్రులు కూడా 'మంచి చదువు' అపోహల్లో పడి.. బిడ్డల గోడు వినిపించుకోవడం లేదు. నిర్దయగా వదిలేసి వస్తుంటారు. 'వారి భవిష్యత్తు కోసమే కదా ఇదంతా..' అని బాధను, ప్రేమను దిగమింగుకుంటారు.

పైసలు ఇవ్వకుంటే ఫైసల్

జిల్లాలోని చాలా ఇంటర్ కాలేజీలలో ఫీజుల వసూళ్లకు ఒక పరిమితి అంటూ కనిపించడం లేదు. తక్కువలో తక్కువ.. రూ.70 వేల నుంచి మొదలెట్టి రూ.1.80 లక్షల వరకూ గుంజుతున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంటే ఓ రేటు, ఇన్‌స్టాల్‌మెంట్ అంటే మరో రేటు అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వారికి ఓ రేటు, ఎవరి పరిచయాలూ లేనివారికి మరో రేటు పెడుతున్నారు. అడ్మిషన్ల కోసం వెళ్లగానే కోర్సులు, సౌకర్యాలు, వసతులు, చదువులు, లెక్చరర్ల గురించి, గతంలో కాలేజీకి వచ్చిన ర్యాంకులు, టన్నుల కొద్దీ వచ్చిన మార్కుల గురించి కథలు చెబుతారు. అదే కాలేజీలో సున్నా మార్కులు వచ్చినవారూ ఉంటారు. అవేవీ బయటపడవు, బయట పెట్టరు. కాలేజీలోకి అడుగు పెట్టగానే రూ.40 వేలు కడితేనే ఐడీ జనరేట్ అవుతుందని తొలిదెబ్బ కొడతారు. సెంట్రల్ ఆఫీస్ రూల్ అంటారు. సీటు, కాటు, బెడ్‌లు ఫుల్ అవుతున్నాయని తొందరపెడతారు. తమ బిడ్డకు ఎక్కడ చోటు దొరకదో అని తల్లిదండ్రులుఅప్పో సప్పో చేసి డబ్బులు కట్టేస్తారు. మొదట రూ.70 వేలు, రూ. 80 వేలుకు ఫైనల్ చేస్తాం అంటారు. మొదట్లోనే రూ.40 వేలు, రూ.50 వేలు గుంజేసి ఉంటారు. ఓ రెండు మూడు నెలలు దాటగానే జీవితంలో వినని ఫీజుల పేర్లు చెప్పి పిండటం మొదలు పెడతారు. తరగతి గదిలో నిలబెడతారు. ఊరికి వెళ్లి తిరిగొస్తే గేటు వద్ద నిలబెడతారు. ప్రిన్సిపాల్, ఏఓ గదిలో నిలబెడతారు. ఎక్కడబడితే అక్కడ అవమానిస్తారు. రెండు, మూడు రోజుల్లో కడతామని తల్లిదండ్రులు చెప్పినా.. వినిపించుకునే పరిస్థితి ఉండదు. చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురైనా.. సిబ్బంది, యాజమాన్యాలకు పట్టింపు ఉండదు. అవమానాలను భరించలేనివారు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



ఉన్నారా.. లేరా..?

ఇంటర్ కాలేజీలలో దారుణాలు జరుగుతున్నా ప్రాంతీయ పర్యవేక్షణాధికారులు పట్టించుకోవడం లేదు. కాలేజీల తనిఖీలు, నిబంధనలు అతిక్రమించిన కాలేజీలపై చర్యలు ఏమాత్రం కనిపించవు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా ఆర్ఐఓలో చలనం కనిపించడం లేదు. నిబంధనల ఉల్లంఘనలను చేష్టలుడిగి చూస్తున్నారు. నిండు ప్రాణాలు బలైపోయినా.. తమకు సంబంధమే లేనట్లు వ్యవహరిస్తున్నారు. అలాంటి అధికారులు ఉండీ ఏం ప్రయోజనం..? వారి జీతాలకు, సౌకర్యాలకు ప్రజా ధనం వెచ్చించడమే దండగ కదా..! ఇంటర్ విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్న నారాయణ జూనియర్ కళాశాల విభాగంలో అక్రమాలపై కొందరు విద్యార్థి సంఘాల నేతలు గతంలో నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐఓ వెంకట రమణ నాయక్.. ఆ కాలేజీ హాస్టల్‌కు వెళ్లి తనిఖీ చేశారు. కాలేజీ సిబ్బంది ఎదుటే విద్యార్థులను విచారించారు. అక్కడ అంతా బాగుందని స్టేట్‌మెంట్ ఇచ్చారు. పక్కకు పిలిచి విచారిస్తేనే వాస్తవాలు బయటకు రావడం కష్టం. అలాంటిది సిబ్బంది ఎదుటే విచారిస్తే నిజం బయటపడుతుందా..? అధికారుల తీరు ఇలా ఉంటే కాలేజీలు బాగుపడేది ఎన్నడు..? కొందరు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులు అప్పుడప్పుడైనా కాలేజీలను సందర్శిస్తే.. పరిస్థితుల్లో కొంతైనా మార్పు వస్తుంది.



గీత కార్మికులకు మద్యం దుకాణాలు

కలెక్టరు సమక్షంలో లాటరీ.. కేటాయింపు



మద్యం దుకాణాల లాటరీ తీస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన 14 మద్యం షాపులను అధికారులు శుక్రవారం లాటరీ తీశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు లాటరీ తీసి, దరఖాస్తుదారులకు మద్యం షాపును కేటాయించారు. గౌడ్ సామాజికవర్గానికి అనంతపురం నగరపాలిక, గుత్తి రూరల్, ఈడిగలకు గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట, బెళుగుప్ప, రాప్తాడు, గుంతకల్లు రూరల్, తాడిపత్రి మున్సిపాలిటీ, గౌండ్లకు డి.హీరేహాళ్, గౌడలకు రాయదుర్గం రూరల్ మద్యం షాపులను కేటాయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య, ఈఎస్ రామమోహన్‌రెడ్డి, ఏఈఎస్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి: కాలవ



ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న కాలవ

అనంతపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర రైతు సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లోని దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతామని అధికారులు తెలియజేశారు. 2023 నుంచి 2410 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీఎండీ సంతోష్‌తో కాలవ ఫోన్‌లో మాట్లాడారు. రాయదుర్గం నియోజకవర్గంలో పెండింగ్ దరఖాస్తులను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వాటిని మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 14 సబ్ స్టేషన్లు మంజూరు కాగా రెండు మాత్రమే ప్రారంభించారని ఎమ్మెల్యే వివరించారు. నేమకల్లు, బాదనహాళ్, కలేకుర్తి, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాలను ప్రాధాన్యం కింద చేపట్టాల్సి ఉందన్నారు. భూసేకరణ, ఇతరత్రా అంశాలను తాము చూసుకుంటామని, తొలుత నాలుగింటిని మంజూరు చేయించాలని కోరారు. ప్రాధాన్యత క్రమంలో వీలైనన్ని ఎక్కువ సర్వీసులను ఫిబ్రవరి నెలాఖరుకు మంజూరు చేస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా సబ్ స్టేషన్లకు మంజూరు ఉత్తర్వులు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ శేషాద్రి శేఖర్, ఏడీఈలు శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల కట్టడికి కార్యాచరణ

నగరవనాలతో ఆహ్లాదం పంచుతాం

జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్



అనంతపురం న్యూటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల నుంచి రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా ఐదేళ్ల కార్యాచరణ అమలు చేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుత్తి, కళ్యాణదుర్గం రేంజ్‌ల పరిధిలో కృష్ణ జింకలు పంటలను ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్నందున కట్టడి చర్యలలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. నష్ట నివారణ కోసం జింకల సంఖ్య, విస్తీర్ణాన్ని లెక్కిస్తున్నామని తెలిపారు. పీసీసీఎఫ్‌కు నివేదించి, వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలుగుబంట్లు సంఖ్య ఎక్కువగా లేకపోయినా, ఉన్న ప్రాంతాలలో రైతులు, ప్రజలపై దాడి చేస్తున్నాయని తెలిపారు. వాటి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలకు తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, దాడులను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కళ్యాణదుర్గం రేంజ్‌లో చిరుతలతో ఇబ్బంది కలుగుతోందని, వీటి సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. వాటి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. అందుకే ఐదేళ్ల కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో నగర వనాలను అభివృద్ధిపరిచి, ప్రజలకు ఆహ్లాదం పంచుతామని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నగరవనాల్లో అభివృద్ధి పనులు ఇప్పటికే 60 శాతం పూర్తి అయ్యాయని తెలిపారు. వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఫిబ్రవరి చివరకల్లా ముఖద్వారాలను పూర్తి చేస్తామని తెలిపారు. చిన్న చిన్న పనులను సైతం వీలైనంత త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

స్కూళ్ల బలోపేతంపై సదస్సు

మూడున్నర గంటలపాటు కమిషనర్ వర్క్‌షాప్

అంతా గుట్టుగానే, మీడియాకు నో ఎంట్రీ

అనంతపురం విద్య, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో 117 జీవో రద్దు నేపథ్యంలో స్కూళ్ల బలోపేతంపై సమావేశం నిర్వహించారు. జేఎన్టీయూలోని ఆడిటోరియంలో శుక్రవారం ఉమ్మడిజిల్లా విద్యాశాఖాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆధ్వర్యంలో కడప ఆర్జేడీ శామ్యూల్, అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ హాజరయ్యారు. గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణంపై ఎంఈఓలు కసరత్తు చేశారు. రెండు జిల్లాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు 1-, 2, డిప్యూటీ డీఈఓలు, సమగ్రశిక్ష ఏపీసీలు, డీఈఓలతో కమిషనర్ జోనల్ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. సుమారు మూడున్నర గంటలకు పైగా నిర్వహించారు. అయితే మీడియాను అనుమతించలేదు. ఈ సందర్భంగా కమిషనర్ 117 రద్దు తర్వాత ఏం చేయబోతున్నాం. ఎలాంటి స్కూళ్లు తీసుకురాబోతున్నారో వివరించినట్లు తెలిసింది. తర్వాత శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలంలోని కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం, అనంతపురం జిల్లా కంబదూరు మండలంలో కాంపెక్స్‌ల పునర్నిర్మాణంపై జిల్లా అధికారులు చేసిన కసరత్తును ఆయన మళ్లీ ఇక్కడ ప్రసావించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిసింది. తర్వాత జీవో 117 రద్దు చేయాలని ఎంత మంది కోరుకుంటున్నారు..? ఎంత మంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్నారు..? మోడల్ ప్రైమరీ స్కూళ్లు కావాలని ఎంత మంది కోరుకుంటున్నారో... చేతులు ఎత్తాలంటూ....ప్రశ్నించి మెజార్టీ వర్గాల అభిప్రాయం కనుక్కున్నట్లు సమాచారం.

ఓటుతోనే సమాజహితం

నేడు జాతీయ ఓటరు దినోత్సవం



అనంతపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజహితానికి ఓటే మూలం. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. అలాంటి ఓటు మంచి వ్యక్తులకు వేసినప్పుడే భావి తరాల ఉజ్వల భవితకు పునాది పడుతుంది. అందుకే ఎన్నికల కమిషన్ ఓటు హక్కు సద్వినియోగంపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించేందుకు చైతన్యం తీసుకురావాలని 2011నుంచి ప్రతిఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తోంది.

• అనంతలోనూ పెరుగుతున్న ఓటర్లు

అనంత జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. తాజాగా జిల్లాలో ఓటర్ల సంఖ్య 20,22,229కు చేరింది. ఇందులో పురుష ఓటర్లు 9,99,357మంది ఉండగా, మహిళాఓటర్లు 10,22,625మంది ఉన్నారు. ఇతరులు 247మంది ఓటర్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు చూపుతున్నాయి. నియోజకవర్గాల వారిగా రాయదుర్గం నియోజకవర్గంలో 2,64,121, ఉరవకొండలో 2,24,935మంది, గుంతకల్లులో 2,71,462, తాడిపత్రిలో 2,49,050మంది, శింగనమలలో 2,48,129మంది, అనంతపురం అర్బన్‌లో 2,81,593మంది, కళ్యాణదుర్గంలో 2,31,817మంది, రాప్తాడు నియోజకవర్గంలో 2,51,122మంది ఓటర్లు ఉన్నారు.



• యువత ముందుకు

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వస్తుంది. అందుకే యువతను చైతన్యం చేసి ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రతిఏటా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. అనంతలోను జిల్లా యంత్రాంగం కలెక్టరు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టింది. అందుకే యువ ఓటర్ల నమోదు కూడా పెరిగింది. అధికారులు చెబుతున్న మేరకు 18ఏళ్లు నిండిన వారు 24,465మంది కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. ఇందులో రాయదుర్గంలో 3547మంది, ఉరవకొండలో 2865మంది, గుంతకల్లులో 2937మంది, తాడిపత్రిలో 3225మంది, శింగనమలలో 2674మంది, అనంతపురం అర్బన్‌లో 2744మంది, కళ్యాణదుర్గంలో 3006మంది, రాప్తాడులో 3437మంది ఉన్నారు.

• జిల్లా యంత్రాంగానికి అవార్డులు

ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు అనంతజిల్లా యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ నుంచి ప్రశంసలు, అవార్డులు వచ్చాయి. ఉత్తమ ఎన్నికల అధికారులుగా ఐఏఎస్ కేటగిరీలో అనంత జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్, ఐపీఎస్ కేటగిరీలో అనంత ఎస్పీ జగదీష్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే ఇతర అధికార విభాగంలో అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్, బీఎల్ఓలు రూపతేజశ్విని(రాప్తాడు) అంజలి (రాయదుర్గం)లకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు దక్కాయి. వీరందరు శనివారం విజయవాడలో నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవంలో గవర్నరు చేతుల మీదుగా అవార్డులు అందుకుంటారు.



అదే అభిమానం

పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, సిద్ధార్థ తదితరులు

6

నేటికీ అదే అభిమానం

ఘనంగా పరిటాల రవి 20వ వర్ధంతి

వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

భర్తను తలుచుకుని పరిటాల సునీత కంటతడి



పరిటాల రవి ఘాట్ వద్దకు రకరకాల వంటకాలను తీసుకొస్తున్న కుటుంబసభ్యులు



పరిటాల రవి ఘాట్ వద్ద మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె తదితరుల నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సిద్ధార్థ, శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

రామగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గతించి రెండు దశాబ్దాలు గడిచినా పరిటాల రవీంద్రపై అభిమానం ఏమాత్రం చెక్కు చెదర లేదు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించేందుకు అభిమానులు వెంకటాపురానికి పోటెత్తారు. మాజీమంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని వేలాది మంది అభిమానుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, తనయులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వెంకటాపురంలోని ఘాట్ వద్దకు వచ్చి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అభిమానులు పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. పరిటాల రవీంద్ర చరిత్రను కీర్తిస్తూ నిర్వహించిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పరిటాల రవీంద్రఘాట్‌కు నివాళులర్పించిన వారిలో మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, కర్ణాటక మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలంగాణ నుంచి వచ్చిన అభిమానులు ఉన్నారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు.

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవి పేరు చెప్పుకునేలా చేస్తాం: పరిటాల శ్రీరామ్

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవిపేరు చెప్పుకునేలా తాము పని చేస్తామని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఆయన మొదటి వర్ధంతి రోజు ఏ స్థాయిలో జనం వచ్చారో అదే స్థాయిలో నేడు కూడా ప్రజాభిమానం కనిపిస్తోందన్నారు. ప్రజాఉద్యమాలలో ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికి మరువలేమన్నారు. ఆయన కలలు, ఆశయాల కోసం పని చేస్తామన్నారు. మాకు తండ్రి లేని లోటు తీర్చిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం చివరి వరకు పనిచేస్తామన్నారు.

మడమ తిప్పని వ్యక్తి : బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం

మాట ఇచ్చాడంటే మడమ తిప్పని వ్యక్తి పరిటాల రవీంద్ర అని ఎంపీ పార్థసారథి పేర్కొన్నారు. 1993ప్రాంతంలో ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండ ప్రాంతాల్లో టీడీపీ జెండా పట్టుకునే వారే లేరని, ఆయనరాకతో పార్టీ అభిమానులు, కార్యకర్తల్లో ధైర్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి జిల్లా టీడీపీని ముందుకు తీసుకెళ్లారన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది పరిటాల రవి అని, బతికిఉన్నంత వరకు ఆయనను మరువలేమన్నారు.

బడుగుల ఆశాజ్యోతి: కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రాయదుర్గం

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర అని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆపద సమయంలో పార్టీకి ఆయన కొండంత అండగా నిలుస్తూ పార్టీశ్రేణుల్లో ధైర్యాన్ని నింపారన్నారు. వందలాది జంటలకు ఉచిత వివాహాలు జరిపించిన మహోన్నత వ్యక్తి పరిటాల రవీంద్రఅన్నారు.

వ్యక్తి కాదు.. ఒక శక్తి: దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే, అనంతపురం

పరిటాల రవి ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. టీడీపీ జెండా పట్టుకోవాలంటే భయపడే పరిస్థితుల నుంచి పార్టీకి జిల్లాను కంచుకోటగా మార్చారన్నారు. 20వ వర్ధంతి కాదు 100 వర్ధంతులు జరిగినా ఆయనపై ప్రజలకున్న అభిమానం తరగదన్నారు.

పరిటాల సునీత కంటతడి

పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పించే సమయంలో ఆయన సతీమణి ఎమ్మెల్యే పరిటాల సునీత భావోద్వేగానికి లోనయ్యారు. అక్కడే కాసేపు కుర్చొని కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనవరి నెల వచ్చిందంటే ఏదో తెలియని బాధ కలుగుతుందన్నారు. నేటికీ వేలాది మంది తరలి వచ్చి నివాళులర్పిస్తుంటే ప్రజల గుండెల్లో ఆయన ఎంత పదిలంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఈనేల ఉన్నంతవరకు పరిటాల రవీంద్రను ఎవరు మరువరన్నారు. ఆరోజు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ఆహ్వానించడమే కాకుండా, ఒక తండ్రిగా అండగా నిలిచారన్నారు. పరిటాల రవీంద్రకు భార్యగా ఉండటం నాకు దక్కిన గొప్పవరమన్నారు. ఆయన మరణం తరువాత ఎదుర్కొన్న కష్టాలు పగవాడికి కూడా రాకూడదన్నారు. ఆయనను ఫ్యాక్షనిస్టుగా ముద్రవేశారని, కానీ ఆయన ఫ్యాక్షన్‌నుంచి ఎన్నోగ్రామాలకు విముక్తి కలిగించి అభివృద్ధి చేశారన్నారు. తమ కుటుంబ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

పరిటాల ఆశయాలు గొప్పవి : పల్లె సింధూరారెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి

ఒక వ్యక్తిపై ఇంత మంది ప్రేమాభిమానులు చూపిస్తున్నారంటే పరిటాల రవి ఎంత గొప్ప వ్యక్తో అర్థమవుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు పరిటాల రవీంద్ర అండగా నిలిచారని, అలాంటి వ్యక్తి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. చివరి వరకు ఆయన ఇచ్చిన మాటకోసమే పనిచేశారు.



తరలివచ్చిన పరిటాల అభిమానులు, టీడీపీ కార్యకర్తలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ, ఆలం నరసానాయుడు తదితరులు

ప్రజాదరణ తరగని నేత: అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

మరణించి 20ఏళ్ల అయినా ఇప్పటికి ప్రజాదరణ తగ్గనినేతగా పరిటాల రవీంద్ర ఉన్నారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అందుకే ఆయన నేటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాపోయారని కొనియాడారు.

పెనుకొండలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం : మంత్రి సవిత

బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్యదైవంగా పరిటాల రవి నిలిచారని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ రోజు ఈ ప్రాంతంలో ఇంత స్వేచ్ఛగా కనిపిస్తోందన్నా, ఆడబిడ్డలు ధైర్యంగా బయట తిరుగుతున్నారన్నా అది కచ్చితంగా పరిటాల రవి చేసిన పోరాట ఫలితమే అన్నారు. శ్రీకాకుళం ప్రాంతంలో కూడా పెనుకొండపేరు చెబితే అది పరిటాల రవి నియోజకవర్గం కదా అంటున్నారంటే ఆయన ఈ ప్రాంతంపై ఎలాంటి ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే పెనుకొండలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. పరిటాల సునీత ఒక వీర వనిత అని పేర్కొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర: ఎంఎస్‌రాజు, ఎమ్మెల్యే, మడకశిర

జిల్లాలో రాజకీయ, ప్రజాపోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఆయన అనంతపురం జిల్లాలో కాకుండా రాష్ట్రంలోనే పేరున్న నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

జిల్లాపై చెరగని ముద్ర : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

జిల్లా రాజకీయాలపై పరిటాల రవీంద్రది చెరగని ముద్ర అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పరిటాల రవీంద్రతో 1993 నుంచి 2005 వరకు తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను పల్లె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

ప్రాణాలు తీస్తారని తెలిసినా వెనక్కి తగ్గలేదు: హనుమంతరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే

2004లో అధికారం కోల్పోయాక శత్రువులు తనను హతమార్చడానికి పొంచి ఉన్నారని తెలిసిన వెనక్కి తగ్గని ధైర్యశాలి పరిటాల రవీంద్ర అని మాజీ ఎమ్మెల్యే హనుమంత రాయచౌదరి పేర్కొన్నారు. కొన్ని రోజులు బయటకు వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాలని సూచిస్తే తాను వెళితే తనవాళ్లు అన్యాయం అవుతారని ధైర్యంగా నిలబడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

బడుగులకు రాజకీయ అవకాశాలు: తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాల ఓట్ల బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన వ్యక్తి పరిటాల రవి అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కొనియాడారు. ఆయన ఆశయాలు ఎంతో గొప్పవని అందుకే ఆయన ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.



నివాళులర్పిస్తున్న చమన్ సతీమణి, తనయుడు



ఎంపీ బీకే, ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్..



అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...



అనంతపురం జిల్లా టీడీపీ నేతలు...

సాయం చేసి.. చోరీ

ఇంటి యజమానిని ఆస్పత్రికి చేర్చి..
10తులాల బంగారు ఆభరణాల అపహరణ
గంటల్లో పట్టేసిన వన్‌టౌన్ పోలీసులు.. సొమ్ము రికవరీ



చోరీ జరిగిన ఇల్లు

అనంతపురం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో సాయం చేసిన వ్యక్తే ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన సంఘటన నగరంలోని రాణీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని రాణినగర్‌లో మహమ్మద్ నబీ రసూల్(58)కుటుంబం నివాసముంటోంది. రసూల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గురువారం కుమార్తె కొడుకు(మనవడు)డికి సంబంధించి తల వెంట్రుకలు తీయించే కార్యక్రమం నిర్వహించారు. దీంతో కొడుకులు, కుమార్తె వచ్చారు. రాత్రి ఫంక్షన్ అయిపోయాక అర్ధరాత్రి 12గంటల సమయంలో నబీ రసూల్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలో పక్క ఇంట్లో ఉంటున్న గౌస్‌మోద్దీన్ ఆటోలో తీసుకెళ్లడానికి సాయం చేస్తూ వారితో పాటే ఆటోలో వెళ్లాడు. కుటుంబసభ్యులందరూ అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో ఓ వృద్ధురాలిని మాత్రమే ఉంచి వచ్చారు. బయట గేటుకు తాళం వేసి వెళ్లారు. ఆసుపత్రిలో రసూల్ చికిత్స పొందుతున్న సమయంలో మహిళలు.. ఇంట్లోనే బంగారు ఆభరణాలు ఉంచి వచ్చామని, కనీసం బీరువాలో ఉంచలేదని మాట్లాడుకోవడం గౌస్ మోద్దీన్ విన్నాడు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నబీ రసూల్ మృతి చెందాడు. కుటుంబసభ్యులు విషాదంలో ఉండిపోయారు. అరగంట తరువాత గౌస్‌మోద్దీన్ నేరుగా రసూల్ ఇంటికి వచ్చాడు. గేటు దూకి లోపలికెళ్లాడు. ఇంట్లో ఉన్న వృద్ధురాలు ఏం వచ్చావని ప్రశ్నిస్తే నబీరసూల్ చనిపోయాడని ఆ విషయం మీకు చెబుదామమని వచ్చానన్నాడు. ఇంట్లో తచ్చాడుతుంటే వృద్ధురాలు ప్రశ్నించగా ఆధార్‌కార్డు తీసుకురమ్మని చెప్పారని చెప్పాడు. ఈక్రమంలోనే వృద్ధురాలికి మస్కా కొట్టి మంచంపైన పరుపుకింద ఉన్న 10తులాల బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించాడు. ఉదయం ఇంటికొచ్చిన కుటుంబసభ్యులు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. వృద్ధురాలి అనుమానం మేరకు నబీరసూల్ కుమారుడు దూదేకుల షానూర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అప్రమత్తమయ్యారు. సిబ్బందితో కలిసి గంటల వ్యవధిలోనే గౌస్‌మోద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా గౌస్‌మోద్దీన్ తాను చేసిన నేరం ఒప్పుకున్నాడు. అతడి నుంచి 10తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

31న ఉమ్మడి జిల్లాకు ఎక్సైజ్ మంత్రి 'కొల్లు' రాక

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌శర్మ, డైరెక్టర్ రాహుల్‌దేవ్ వర్మ ఈ నెల 31న రానున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణాల నిర్వహణ ఎలా సాగుతోంది..? అక్రమ మద్యం అరికట్టడంలో అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారు..? బెల్టుషాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారుల పనితీరు తదితర అంశాలపై వీరు సమీక్షించ నున్నారు. పర్యటనలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలోని పాలసముద్రం సమీపంలో ఐఎంఎల్ డిపో భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారు. తర్వాత అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి వద్ద నిర్మించిన ఐఎంఎల్ డిపో భవనాన్ని ప్రారంభిస్తారు. 2014లో ఇక్కడ ఉన్న ఐఎంఎల్ డిపో అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. దీంతో అక్కడే కొత్త భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్నే మంత్రి ప్రారంభించనున్నారు. కాగా... నవోదయం 2.0 రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా నుంచే ప్రారంభించనున్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఎక్సైజ్ శాఖ పనితీరుపై మంత్రి సమీక్ష చేయనున్న నేపథ్యంలో ఆ శాఖాధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం. దీనికి తోడు బెల్టు తీసేదెవరు..? శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో... అనధికారిక పర్మిట్ రూములు, బెల్టుషాపులు నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు సమాచారం.

వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి 20వ వర్ధంతిని శుక్రవారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా వివిధ రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి వీరారెడ్డి అని కొనియాడారు. అనేక పోరాటాల్లో రాటుదేలిన వీరారెడ్డి చనిపోయి 20 సంవత్సరాలైనప్పటికీ ఆయన స్ఫూర్తిని నెమరు వేసుకుంటూ నేటి సీపీఎం నాయకత్వం జిల్లాలో పెద్దఎత్తున రైతు, కార్మిక పోరాటాలతో ఆందోళనలను కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్వీ నాయుడు, ముత్తుజా, వెంకటనారాయణ, ఇర్ఫాన్, ఓబులేసు, రాజు, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, గఫూర్, బాలకృష్ణ, ఆదినారాయణ, పోతులయ్య, శంషాద్, లాలెమ్మ, మాబ్బి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు

పామిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రభుత్వ వైద్యుడు కమలాధర్ అరుదైన ఆపరేషన్ చేశారు. పట్టణంలోని తిరుమలేసు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. పరీక్షించిన వైద్యులు డెర్మాయిడ్ సిస్ట్ ఆపరేషన్ చేయాలని సూచించారు. వైద్యుడు కమలాధర్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఎన్నో శస్త్ర చికిత్సలను ఇక్కడే విజయవంతంగా చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, హెడ్ నర్సు శివకుమారి, ఓటీ అసిస్టెంట్ అంజనప్ప, కమిటీ సభ్యురాలు పూజారి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.17,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



రిపబ్లిక్ డే ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్‌డే ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపడుతూ వస్తోంది. జిల్లా ఎస్పీ జగదీష్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే అధికారులతో సమావేశమై ఏర్పాట్లు విషయంలో ఎక్కడెక్కడా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆదేశాలు జారీ చేశారు. వేడుకలు వీక్షించడానికి వచ్చే వారికి అవసరమైన కుర్చీలు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రిహార్సల్స్ చేయించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, డీపీఎం ఆనంద్, సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురంరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1,350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

ఏపీ హ్యాండ్‌బాల్ జట్టుకు ఇంటర్ విద్యార్థి



రాజును అభినందిస్తున్న శామ్యూల్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్‌జీఎఫ్(స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) హ్యాండ్‌బాల్ పోటీలకు కంబదూరుకు చెందిన విద్యార్థి రాజు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించే 38వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టు తరఫున రాజు ప్రాతినిథ్యం వహించనున్నాడు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన రాజును విద్యాశాఖ ఆర్‌డీ శామ్యూల్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శివశంకర్, పీడీలు కేశవమూర్తి, శ్రీనివాసులు, నాగరాజులు అభినందనలు తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతుగా రమేష్‌నాయుడు



ఆత్మకూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. సిద్దరాంపురం గ్రామానికి చెందిన రాజనేని రమేష్‌నాయుడుకు జాతీయ ఉత్తమ రైతు అవార్డు లభించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా అందుకోనున్నారు. ఉద్యాన పంటల్లో మంచి దిగుబడులు సాధించడంతో పాటు పండ్లతోటలను వినూత్న రీతిలో సాగుచేయడంలో రైతులకు ఆదర్శంగా నిలిచారు. దీంతో ఉత్తమరైతు అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అవార్డు సాధించిన రమేష్‌నాయుడును పలువురు రైతులు అభినందించారు.


లేపాక్షి ఆలయం

పర్యాటక ఖిల్లా..!

జిల్లా అంతటా టూరిజం ప్రదేశాలు

దేశవిదేశాల నుంచి పర్యాటకుల రాక

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం


చిత్రావతి నదిలో బోటింగ్

పుట్టపర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి): శిల్పకళల కాణాచి లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథి పక్షులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రక విశేషాలే. జిల్లా పర్యాటకానికి ఖిల్లా అనడంలో అతిశయోక్తి లేదు. చారిత్రక సంపదకు కొదువలేదు. ప్రతిరోజూ దేశవిదేశాల నుంచి పర్యాటకులు జిల్లాకు వస్తున్నారు. ఇలాంటి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబరులో నిర్వహించిన పర్యాటక శాఖ సమీక్షలో పర్యాటక అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించారు. పర్యాటక సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటన్నింటిని పర్యాటకంగా అభివృద్ధి చేసి జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


గొల్లపల్లి రిజర్వాయర్

అభివృద్ధికి చర్యలు

జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు ఇటీవల కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన పర్యాటక, పురావస్తు, దేవదాయ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. శిల్పకళాక్షేత్రం లేపాక్షిలో జటాయువు థీమ్‌పార్కు, ఫుడ్ కోర్టు, స్టాల్స్ ఏర్పాటు, పర్యాటకులకు అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పన, ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం, గొల్లపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్, తనకల్లు మండలం కోటపల్లిలో రేస్‌ట్రాక్, థీమ్ లగ్జరీ రిసార్ట్ పీపీపీ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రతిపాదనలు చేశారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను ప్రత్యేక పర్యాటక వలయాలుగా (సర్క్యూట్) తీసుకువచ్చేందుకు కార్యాచరణ మొదలు పెట్టారు. ఇప్పటికే పుట్టపర్తిలో చిత్రావతి రిజర్వాయర్‌తోపాటు బుక్కపట్నం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇంకా బోటింగ్ ఏర్పాటుకు అనుకూలతలపై ఆరా తీస్తున్నారు. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో పెనుకొండకు దేశవిదేశీయుల తాకిడి పెరిగింది. ఇక్కడ పర్యాటకంగా అభివద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్‌తో ఇప్పటికే బెంగళూరు నుంచి లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, హార్సిలీహిల్స్ మీదుగా బెంగళూరుకు పర్యాటక వలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి వసతులతో అన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది.


నంది విగ్రహం


ఖాద్రీశుడి ఆలయం

తెరపైకి ప్రత్యేక వలయం..


ఎంతో శిల్పకళా వైభవం ఉన్న లేపాక్షి ప్రపంచానికి తెలిసినా వారసత్వ సంపద గుర్తింపు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది జనవరి 16న ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు జీ-20 దేశాల ప్రతినిధులు సైతం లేపాక్షిని సదర్శించారు. దీంతో ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. గత టీడీపీ ప్రభుత్వం లేపాక్షి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, ప్రాచుర్యాన్ని ముందుకు తీసుకువచ్చింది. లేపాక్షిని ప్రపంచస్థాయి ఆకర్షించాలా 2016, 2018లో లేపాక్షి నంది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పది కోట్లకుపైగా నిధులు విడుదల చేసి, అభివృద్ధి పనులు చేపట్టారు. లేపాక్షికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చినట్లయింది. రెండేళ్ల కిందట యునెస్కో తాత్కాలిక జాబితాలో లేపాక్షికి చోటు లభించింది. వారసత్వ సంపద గుర్తింపు దక్కింది. ఇటీవల లేపాక్షికి పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది.

కదిరి ప్రాంతంలో..


తిమ్మమ్మ మర్రిమాను

కదిరి: ప్రసిద్ధిచెందిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన ప్రపంచంలోనే అతి పెద్దదైన తిమ్మమ్మ మర్రిమాను, ప్రజాకవి యోగివేమన సమాధి, బట్రేపల్లి జలపాతం, పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానాలు కదిరి ప్రాంతంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభుగా వెలిశారు. ఆయన తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్ణాటక, తమిళనాడులో వేలాదిమంది భక్తులకు అరాధ్యదైవం. ప్రహ్లాదసమేతుడైన లక్ష్మీనరసింహస్వామి ఇక్కడ స్వయంభుగా వెలిశారు. దేశంలోనే అతి పెద్ద మూడో రథం కదిరిలో ఉంది.

ప్రపంచంలోనే పెద్ద చెట్టు



సత్యసాయి మహాసమాధి

ప్రపంచంలోనే అతి పెద్దదిగా నంబులపూలకుంట మండలంలోని గూటిబైలులో గల తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ బుక్ రికార్డులకెక్కింది. 500 ఏళ్ల వయసున్న ఈచెట్టు దాదాపు 9 ఎకరాల్లో విస్తరించి ఉంది. తిమ్మమాంబ నాటిన ఈచెట్టు శాఖోప శాఖలుగా విస్తరించిందని భక్తులు చెబుతారు. ప్రజాకవి యోగివేమన సమాధి కదిరినుంచికేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. కదిరి, రాయచోటి రహదారిలోని కటారుపల్లి క్రాస్‌నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. తన పద్యాలతో సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేసిన ప్రజాకవి యోగివేమన సమాధి ఇక్కడ ఉంది. కదిరి-పులివెందల రహదారిలో బట్రేపల్లి జలపాతం ఉంది. వర్షాకాలంలో జలపాతం కనువిందు చేస్తుంది. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది సందర్శనకు వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

803 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 803 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 454 క్యూసెక్కులు వెళ్తున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

లేపాక్షి విద్యార్థికి అరుదైన గౌరవం


సాయికిరణ్

లేపాక్షి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి సాయికిరణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఈనెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి విద్యార్థికి ఆహ్వానం అందినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. విద్యార్థి స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో గతేడాది పదో తరగతి చదివాడు. ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో విద్యార్థికి ఆహ్వానం అందినట్లు తహసీల్దార్ వివరించారు. విద్యార్థిని అధికారులు, స్థానికులు అభినందించారు. విద్యార్థి ప్రస్తుతం హిందూపురంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

అంతర్జాతీయ జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థి

ధర్మవరంరూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అఫ్జల్‌మెహరాజ్ అంతర్జాతీయ జూడో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ప్రతాప్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. తద్వారా అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25వ తేదీ నుంచి భోపాల్‌లోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు తరఫున అఫ్జల్ మెహరాజ్ ప్రాతినిధ్యం వహిస్తారని పీఈటీ తెలిపారు. విద్యార్థిని పాఠశాల హెచ్ఎం తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


పోటీలకు ఎంపికైన అఫ్జల్ మెహరాజ్

బ్యాక్ డోర్ ఉద్యోగం.. పెద్ద మోసం..!

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశలు
- రూ.లక్షలు వసూలు
- కొన్నాళ్లపాటు మాయమాటలు
- తర్వాత స్పందించని వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



హిందూపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగాన్ని కూడా మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఐటీ, నాన్ ఐటీ కంపెనీల్లో అడ్డదారిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి, రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, ఆశలు రేపుతున్నారు. డబ్బులు ఇస్తే.. అడ్డదారిలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. వాటిని నమ్మి రూ.లక్షలు మోసగాళ్ల చేతిలో పెడుతున్నారు. తర్వాత కొన్నినెలలపాటు అదిగో.. ఇదిగో.. ఉద్యోగం అంటూ నమ్మిస్తున్నారు. కొన్ని నెలలకు మోసగాళ్ల ఫోన్ నంబర్లు పనిచేయకుండా పోతున్నాయి. డబ్బు పోగొట్టుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు.

ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగం ఇప్పిస్తామంటూ..

బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, డిగ్రీలు చదివి లక్షలాది మంది యువతీయువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని, బయటకు వస్తున్నారు. వీరిలో కొందరికే ఉద్యోగాలు దొరుకుతున్నాయి. చాలామంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. వారు ఉద్యోగాన్వేషణలో పడుతున్నారు. నగరాలకు వెళ్లి చిన్నాచితకా ఉద్యోగులు చేసుకుంటున్నారు. చదువుకు తగిన ఉద్యోగం రాక, ఇతర పనులు చేయలేక సతమతమవుతున్నారు. ఎన్నో వ్యయప్రయాలకోర్చి పిల్లలను చదివిస్తే ఉద్యోగం రాక వారు పడుతున్న బాధలు చూసి, తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారు. ఇలా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూసినా ఉద్యోగాలు రావనీ, వేరే మార్గం ఉందని నమ్మిస్తున్నారు. డబ్బులు ఇస్తే బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. పరీక్షలు రాయనక్కరలేదనీ, ఇంటర్వ్యూ తాము చూసుకుంటామని చెబుతున్నారు. మేనేజర్లతో మాట్లాడుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూన్నారు. ఉద్యోగాలు రాక నిరాశతో ఉన్న విద్యార్థులు ఈ విషయాలను తల్లిదండ్రులకు చెబుతున్నారు. కొంతమంది నేరుగా తల్లిదండ్రులతోనే మాట్లాడుతున్నారు. పిల్లలకు ఉద్యోగం వస్తే చాలని తల్లిదండ్రులు.. మోసగాళ్ల వలలో పడుతున్నారు. వారు అడిగినంత సొమ్ము చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. అప్పులు చేసి.. మరీ డబ్బు చెల్లిస్తున్నారు. రెండు నెలల్లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బు తీసుకుంటున్నారు. ఐటీ ఉద్యోగానికైతే రూ.2.5 లక్షలు, నాన్ ఐటీకైతే రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బు ముట్టాక కొన్నిరోజులు మాటలు చెబుతున్నారు. ఉద్యోగం ఇప్పించే పనిలోనే ఉన్నామంటారు. ప్రస్తుతం కంపెనీలోనే ఉన్నామనీ, ఉద్యోగం గ్యారంటీ అంటారు. తరువాత మెల్లగా ఫోన్ తీయడం మానేస్తారు. అనంతరం ఫోన్ నంబర్ మార్చేస్తారు. మోసపోయామని గ్రహించిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇంకొంతమంది డబ్బు ఇచ్చి ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

రూ.రెండు లక్షలు ఇచ్చా

బీటెక్ పూర్తి చేశా. క్యాంపస్‌లో ఉద్యోగం రాలేదు. ఉద్యోగాన్వేషణలో ఉన్నాం. తెలిసిన వారి ద్వారా ఫలానా వ్యక్తిని కలిస్తే బ్యాక్‌డోర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. రూ.2 లక్షలు ఇచ్చా. ఏడాది గడిచిపోయింది. అదిగో.. ఇదిగో అంటున్నాడు. ఇంకా ఆశగా ఎదురు చూస్తున్నా.

- ఓ నిరుద్యోగి, హిందూపురం

ఉద్యోగం ఇప్పిస్తానంటే డబ్బు ఇచ్చా

ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నా. బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానంటే డబ్బు ఇచ్చా. నెలలు గడిచి పోతున్నా ఉద్యోగం ఇప్పించకపోగా.. ఫోన్ కూడా తీయడం లేదు. మోసపోయానేమో అనిపిస్తుంది. అసలే చాలా సమస్యల్లో ఉన్నాం. ఇలాంటి సమయంలో ఉద్యోగం రాకపోతే బతుకే భారమవుతుంది.

- ఓ విద్యార్థిని

మట్టిని మింగేస్తున్నారు..!


కాలువ నుంచి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం


ఓ వెంచర్‌లో కాలువ మట్టిని చదును చేస్తున్న దృశ్యం

- కాలువ మట్టిని తవ్వి, వెంచర్లకు తరలిస్తున్న వైనం
- అక్రమ రవాణాతో లక్షలు గడిస్తున్న మాఫియా

ఉరవకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువ గట్టు నుంచి ఎలాంటి అనుమతు లు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఈ తతంగం అంతా కళ్లముందే జరుగుతున్న అన్ని శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. నల్లరేగడి భూముల్లో వెంచర్లు వేయడంతో ప్లాట్లు అమ్ముకోవడానికి రియల్ వ్యాపారులు ఈ మట్టిని అందులోకి తరలిస్తున్నారు. ఈక్రమంలోనే మట్టి మాఫియా లక్షలాది రూపాయలు గడిస్తోంది. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తులు మట్టితో వ్యాపారం చేస్తున్నారు. ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో వెంచర్లు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. వెంచర్‌లో రహదారుల ఏర్పాటుకు, భూమిని చదును చేసేందుకు మట్టి అవసరమవుతుంది. దీంతో అక్రమార్కులు కన్ను హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువ గట్లపై పడింది. వెంచర్లతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టే వారితో ఒప్పందాలు కుదుర్చుకుని మట్టిని తరలిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.800 దాకా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. జాతీయ రహదారి వెంబడి మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకుండిపోయారు. ఈ విషయంపై హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ భాస్కర్‌ను వివరణ కోరగా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. గతంలోనూ మట్టిని తరలిస్తుండగా ట్రాక్టర్ యజమానులు మందలించాం. పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆస్ట్రేలియాలో ఉద్యోగం వదులుకుని..

ప్రజాసేవలో వైద్యుడు గోపీనాథ్


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గోపీనాథ్ (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆయన వైద్యుడు. అది కూడా ఆస్ట్రేలియాలో. ఏళ్లపాటు అక్కడ పనిచేశారు. ఫిజియోథెరపిస్టుగా సేవలందించారు. ఆయన కుటుంబమంతా వైద్యులే. ఈ ప్రాంత ప్రజల స్థితిగతులను చూసి, చలించిపోయారు. ఆస్ట్రేలియాలో వైద్యుడి ఉద్యోగం వదులుకుని, ప్రజాసేవ చేయాలని నిశ్చయించుకున్నారు. పెనుకొండలో దశాబ్దానికిపైగా పేదలు, మహిళలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పేదలకు సాయం చేయడంలోనే ఆనందం ఉంది అంటున్నారు పెనుకొండ పట్టణానికి చెందిన డాక్టర్ గోపీనాథ్.

కుటుంబ నేపథ్యం..

డా.గోపీనాథ్ స్వస్థలం తిరుపతి. తండ్రి గోపాల్ డ్రైవర్‌గా పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. గోపాల్‌కు కుమారుడు గోపీనాథ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంటిలో అందరూ వైద్యులే. కుమార్తెల భర్తలు కూడా వైద్యులే. పేద విద్యార్థులను చూసి చలించిపోయిన ఆయన వారికి తనవంతు సాయం చేసేందుకు పూనుకున్నారు. పెనుకొండకు వచ్చి, స్థిరపడ్డారు. స్థానికంగా పేదలు, మహిళలు, విద్యార్థులకు సాయం చేస్తున్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.21 లక్షలతో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆటస్థలం, అభివృద్ధి, సభావేదిక క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.7లక్షలు ఖర్చుచేసి మండలస్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. కరోనా విపత్తు సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు మాస్కులు పంపిణీ చేశారు. 2017లో కియ కార్లపరిశ్రమ రాకతో ఇక్కడ కొరియన్ భాష రాక ఇబ్బంది పడేవారు. కొరియన్ భాషను నేర్పించేందుకు తోడ్పాటు అందించారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌లో పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పరికరాలు, దుప్పట్లు, పేద మహిళలకు చీరలను ఏటా పంపిణీ చేస్తున్నారు. రెండు నెలల క్రితం పేద మహిళలకు ఉపాధి కల్పించేందుకు 150 మందికి పది రోజులపాటు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చి అవసరమైన సామగ్రి అందించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలై.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపిన మేరకు శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన షేక్‌నూర్ మహ్మద్ ముబారక్ నగరంలోని కరకంబాడిలో ఉంటూ అమర ఆస్పత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతడు.. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వీటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే శుక్రవారం తిరుపతిలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ ఈయన బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ మహేష్ అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ముబారక్ మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని తిరుపతి రూయాకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

GRAND OPENING IN ANANTAPUR

విజేత Fresh Healthy Living ®

25th January | Saturday | 04:59 PM

INAUGURATION BY



- **Shri Daggupati Venkata Prasad Garu** — MLA Ananthapur
- **Shri Ambica Laxminarayana Garu** — Member of Parliament Ananthapur
- **Shri B K Parthasarathi Garu** — Member of Parliament Hindupur
- **Shri Paritala Sriram Garu** — TDP Incharge - Dharmavaram Constituency
- **Shri MS Raju Garu** — Madakasira MLA & TTD Board Member

On Purchase of ₹999/- Get VIJETHA PREMIUM SUGAR 1KG ₹52/- FREE

OFFERS VALID FROM 4th TO 6th JANUARY 2025 ONLY.

Freedom Sunflower Oil 5L Jar
Vijetha Premium Sugar 1kg
Aashirvaad Whole Wheat Atta 5+1kg
MRP. 1337/- VIJETHA PRICE ₹1089 ONLY SAVE ₹248

Product	Details	Offer
TOMATO LOCAL	PER KG Vijetha Price	₹9
CABBAGE	PER KG Vijetha Price	₹15
CAULIFLOWER	PER PC Vijetha Price	₹15
KADDU (BOTTLE GOURD)	PER KG Vijetha Price	₹19
POTATO	PER KG Vijetha Price	₹29
ONION RED	PER KG Vijetha Price	₹29
KIWI FRUIT REGULAR	PER PC Vijetha Price	₹29
VIJETHA WHOLE WHEAT ATTA 1KG / 5KG	MRP ₹ 90/445 Vijetha Offer	BUY 1 GET 1 FREE
BASMATHI RICE LOOSE	PER KG Vijetha Price	₹89
SUGAR LOOSE	PER KG Vijetha Price	₹39
URAD ROUND LOOSE	PER KG Vijetha Price	₹119
TOOR DAL LOOSE	PER KG Vijetha Price	₹139
IDLY RAWA LOOSE	PER KG Vijetha Price	₹39
TSF MILK BREAD 450G/ PAV BUN /CAKE 200G/ MUFFINS / DONUT 160G (SELECTED RANGE)	Vijetha Offer	BUY 1 GET 1 FREE
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH	MRP ₹ 160 Vijetha Price	₹135 ONLY
FORTUNE SUNFLOWER OIL 1LT POUCH	MRP ₹ 165 Vijetha Price	₹139 ONLY
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES KIMJO / ASRA KIMIA DATES 400G BOX	Vijetha Offer	BUY 1 GET 1 FREE
JERSEY DOODH PEDA 190G/ BADAM MILK 185ML PET	MRP ₹ 40-199 Vijetha Offer	BUY 1 GET 1 FREE
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 420G	MRP ₹ 90 Vijetha Offer	₹35 OFF ON MRP
SUNFEAST MOMS MAGIC CASHEW & ALMOND COOKIES 94.5G	MRP ₹ 35 Vijetha Offer	BUY 1 GET 1 FREE
3ROSES NATURAL CARE TEA POWDER 500G	MRP ₹ 470 Vijetha Offer	₹35 OFF ON MRP
PARACHUTE COCONUT OIL 600ML	MRP ₹ 296 Vijetha Offer	₹75 OFF ON MRP
SUNSILK SHAMPOO STUNNING BLACK SHINE 650ML	MRP ₹ 809 Vijetha Offer	BUY 1 GET 1 FREE
REXONA SOAP COCONUT& OLIVE 150G*3PC SET	MRP ₹ 267 Vijetha Offer	₹75 OFF ON MRP
PEPSODENT 2IN1 TOOTH PASTE 150G*2 PACK	MRP ₹ 250 Vijetha Offer	BUY 1 GET 1 FREE
SURF EXCEL SOAP 200G*4PC SET	MRP ₹ 125 Vijetha Offer	₹15 OFF ON MRP
VIM SOAP ANTI SMELL WITH PUDINA 200G*5PC SET	MRP ₹ 130 Vijetha Offer	₹20 OFF ON MRP
TRELLIS INSPIRATION FLAT TAWA FT 285	MRP ₹ 1195 Vijetha Price	₹599 ONLY

OFFERS VALID ON 25th & 26th JANUARY 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS

scan for location

Vijetha Supermarkets Pvt. Ltd.

Telangana • Andhra Pradesh

Maruthi Nagar 80 Feet Road Opp. Y.V Shiva Reddy House, Beside Mythrivanam Hotel, Anantapur, Andhra Pradesh - 515001. Ph.: 91543 63466 vijethasupermarkets VijethaSuperMarketsPvtLtd

SINCE 1999 In Customer Service

న్యూస్ బాక్స్

అక్రమ రవాణాపై నిఘా ఉంచండి

● సమీక్షలో కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకడిపోల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరకులను అక్రమంగా తరలించకుండా గట్టి నిఘా పెట్టాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సరకుల అక్రమరవాణాపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో నిత్యావసర సరకులను పేదలకు అందిస్తోందన్నారు. వాటిని లబ్ధిదారులకు మాత్రమే అందించాలన్నారు. అక్రమ నిల్వలు, రవాణా జరగకుండా సివిల్‌సప్లై, పోలీస్, విజిలెన్స్, కమర్షియల్ టాక్స్, తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ టీం నిత్యం గోదాములు, పెట్రోల్‌బంకులు, స్టాక్‌పాయింట్లు, చౌకడిపోలను తనిఖీ చేయాలన్నారు. అక్రమ నిల్వలు, తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. తనిఖీల నివేదికలు ప్రతివారం పంపించాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, సివిల్‌సప్లై శాఖ డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం రమేష్‌రెడ్డి, ఏటీవీఏస్పీ శ్రీనివాస్, రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ శేషాద్రి పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రుణాలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి ప్రభుత్వంతో కలిసి ఎంఎస్ఎంఈ కింద ప్రత్యేక రుణాలు అందజేస్తామని ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. శుక్రవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక రూడ్‌సెట్‌లో మహిళలకు ఎంఎస్ఎంఈపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఎల్‌డీఎం, కెనరాబ్యాంకు డివిజనల్ మేనేజర్ షేక్ మెహబూబ్ మాట్లాడుతూ మహిళలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చీరలు మడతపెట్టే పెట్టెల తయారీ, చుట్టడంపై అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం, బ్యాంకు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఆస్పత్రి డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు హేమలత పదోతరగతి అమ్మాయిలకు తనవంతు చేయూత అందించారు. శుక్రవారం నగరంలోని మొదటిరోడ్డు శారదానగరపాలక ఉన్నత పాఠశాలలో బాలికలకు స్టడీ మెటీరియల్ అందించారు.

డ్రైవర్లకు ఉచిత వైద్యపరీక్షలు

అనంతపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అనంతపురం రవాణా శాఖ ఆధ్వర్యంలో 126 మంది డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నగర శివారులోని అనంతపురం హెవీ గూడ్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో లారీ డ్రైవర్లకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతపురం ఆర్టీఓ సురేష్ నాయుడు, ఎంవీఐ శ్రీనివాసులు వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. ఆర్టీఓ సురేష్‌నాయుడు మాట్లాడుతూ సవేరా ఆస్పత్రి యాజమాన్యం సౌజన్యంతో 126 మంది డ్రైవర్లకు గుండె, కంటి పరీక్షలు, ఇతర సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠంనాయుడు, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడే విజేత సూపర్ మార్కెట్స్ ప్రారంభం



అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం విజేత సూపర్‌మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ మారుకొండ జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మారుతీనగర్ 80 ఫీట్ రోడ్డులో మైత్రివనం హోటల్ పక్కన సూపర్ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం 4.59 గంటలకు నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నారు. నగర ప్రజలు సూపర్ మార్కెట్స్‌కు విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లే కీలకం: డీఎం



డ్రైవర్లకు పువ్వులు అందిస్తున్న డీఎం నాగభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధితోపాటు ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని అనంతపురం డీఎం నాగభూపాల్ అన్నారు. డ్రైవర్స్‌డేను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో విధులకు వెళ్తున్న డ్రైవర్లకు డీఎం చేతులమీదుగా గులాబిపువ్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి, డ్రైవర్లు పాల్గొన్నారు.

సాంకేతికతను విధులకు జోడించండి



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం విద్య, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉద్యోగులు విధులకు జోడించాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. శుక్రవారం జడ్పీలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎంపీడీఓలకు ఈ-ఆఫీస్‌పై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ సాంకేతికతకు అనుగుణంగా ప్రతి మార్పును రోజువారీ కార్యాలయ విధుల్లో అమలు చేయాలన్నారు. ఈ-ఆఫీస్‌లోనే ప్రతి ఫైల్ నడిచేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పీటీసీ ఆవరణలోని కామితార్థ మహాగణపతి ఆలయంలో ఫిబ్రవరి 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న ప్రథమ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరప్రసాద్, పురుషోత్తమ, మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ఆవరణలో వార్షికోత్సవ కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు నిర్మలామురళి, గొళ్లపల్లి సుబ్రహ్మణ్యం, పట్నం విశ్వేశ్వరరావు, మమత పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ఆమోదం

● 30న తొలి సమావేశానికి నిర్ణయం

● వెల్లడించిన సూపరింటెండెంట్



అనంతపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంత జిల్లాకు కీలకమైన సర్వజన ఆస్పత్రి అభివృద్ధి నూతన కమిటీకి ఎట్టకేలకు ఆమోదం లభించింది. వారంరోజుల క్రితమే కలెక్టరు నలుగురు సభ్యులను ఆమోదించి ఆస్పత్రికి పంపిన విషయం తెలిసిందే. అయితే ఆ కమిటీ సభ్యుల ఎంపిక విషయంలో వైద్యశాఖామంత్రి, అనంతపురం ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చర్చసాగింది. దీంతో ఆ కమిటీని ప్రకటించకుండా అధికార యంత్రాంగం ఆపేసింది. మంత్రి, ఎంపీ ప్రతిపాదించిన వారిలో ఎవరిని తీసుకోవాలోనని తర్జనభర్జన పడుతూ వచ్చారు. చివరకు ఐదుగురు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కమిటీని శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు అధికారికంగా ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టరు, కోచైర్మన్‌గా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గౌరవసభ్యులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా ఆర్డీటీ డైరెక్టరు విశాలా ఫెర్రర్, కోనంకి గంగారామ్, క్యాటరింగ్ వెంకటరమణ, నరసింహులు, రత్నమయ్యలను నియమించారు. ఈ కమిటీతో 30వ తేదీన తొలిసారి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. గత కొద్దిరోజులుగా తలనొప్పిగా మారిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ఎంపిక పూర్తికావడంతో హమ్మయ్యా అంటూ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

ఉపాధి చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో ఉపాధిహామీ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేసి వలసలు నివారించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు, పేదలు పట్టణాలకు వలసబాట పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఉపాధి హామీపథకం కింద జాబ్‌కార్డుదారులందరికీ స్థానికంగా పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంగయ్య, లింగమయ్య, పెద్దయ్య, సంగప్ప, చిన్నరాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటనారాయణరెడ్డి మృతికి ఎమ్మెల్యే నివాళి

శింగనమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయునిపేట గ్రామానికి చెందిన వెంకటనారాయణరెడ్డి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

వ్యవసాయ పరికరాల చోరీకి యత్నం

● రైతులు గుర్తించడంతో పారిపోయిన దొంగలు

కనగానపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ పరికరాల దుండగులు సంచరిస్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. గురువారం రాత్రి దాదులూరు, మామిళ్ళపల్లి గ్రామాల్లో వ్యవసాయ పరికరాల చోరీకి వచ్చిన దుండగులు రైతులు గుర్తించడంతో పరారయ్యారు. దాదాలూరు చింతవనం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్, కాపర్ చోరీ చేసేందుకు దుండగులు ప్రయత్నిస్తున్నారు. ఆ సమయంలో అటుగా పొలం వద్దకు వెళుతున్న రైతులు అనుమానం వచ్చి టార్చ్‌లైట్ వేయడంతో దుండగులు పరారయ్యారు. రైతులు కేకలు వేయడంతో స్పానర్లు, చేతిగ్లౌజులు, బ్యాగులు, రగ్గులు అక్కడే వేసి ఉడాయించినట్లు గ్రామస్థులు తెలిపారు. అలాగే మామిళ్ళపల్లి గ్రామంలో కూడా దొంగలు సంచరించడంతో రైతులు వారిని తరిమికొట్టినట్లు తెలిపారు. జరిగిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అనంతపురం క్రైం,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. అశోక్‌నగర్‌లో నివాసముంటున్న నారాయణస్వామి బేల్దారి పనిచేస్తుంటాడు. శుక్రవారం జేఎన్‌టీయూ సమీపంలోని పనికి వెళ్లి ఇంటికి బయలుదేరాడు. కొంతదూరంగా రాగానే వెనుకనుంచి వస్తున్న కారు ఢీకొంది. తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో ఉన్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నగరానికి చెందిన రామిరెడ్డి రఘువీరా టవర్స్ వద్దకు బైక్‌లో వచ్చాడు. ఎదురుగా అక్కడున్న ఓ తోపుడుబండి వద్ద సపోటకాయలు కొంటుండగా వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కారును వదిలి పరారయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

కనగానపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు గ్రామంలో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రిజ్వాన్ శుక్రవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు దాదులూరు గ్రామ శివారులో సిబ్బందితో కలసి దాడి చేయగా పేకాట ఆడుతున్న వారిని గుర్తించామన్నారు. 9మంది జూదరులపై కేసునమోదు చేసి వారి వద్ద రూ.41,700 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

టెస్ట్ డ్రైవ్ కారుకు ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రాప్తాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టెస్ట్ డ్రైవ్ కోసం షో రూం నుంచి బయటకు వెళ్లిన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన మేరకు అనంతపురం నగరంలో నివాసం ఉంటున్న తేజ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం నగర శావారులో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ షోరూంలో కొత్త ఎలక్ట్రికల్ కారు కొనేందుకు వచ్చి కారు టెస్ట్ డ్రైవ్ కోసం జాతీయరహదారిపై రాప్తాడు వైపు వెళ్లాడు. రాప్తాడు సమీపంలో సడన్ బ్రేక్ వేయడంతో వెనుకవైపు వస్తున్న నాలుగు కార్లు వరుసగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు స్వల్పంగా గాయపడ్డాడు. నాలుగు కార్లు దెబ్బతిన్నాయి. దీంతో కొంత సేపు ట్రాఫిక్ జాం అయింది. రాప్తాడు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి వెళ్లి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అలరించిన రంగప్రవేశం



రంగప్రవేశంలో చిన్నారుల నృత్యప్రదర్శన

అనంతపురం కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీ నృత్యకళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో నిర్వహించిన రంగప్రవేశం వీక్షకులను ఎంతగానో అలరించింది. నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శిష్యబృందంలోని 13 మంది చిన్నారులు పుష్పాంజలి, గజవదన, బెడువే, సరస్వతీ నమోస్తుతే, అన్నమాచార్య కీర్తనలు, వినరో భాగ్యము, గోవిందా గోవిందాయని, కొలువరే భద్రాచల రామదాసు కీర్తనలు ఇలా 12 రకాల అంశాలపై భరతనాట్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం చిన్నారులు వేదాన్విత, దీక్షిత, నితీష, భార్గవి, మేఘన, మాన్విత, నివాన్వి, మన్వితశ్రీ నందన, వైష్ణవి, హర్షవర్ష, సాయి హిమశ్రీ, దర్శిని, హిమవర్షకు జ్ఞాపికలు బహూకరించారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

అనంతపురం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవోదయకాలనీ శ్మశాన వాటికలో రూ.40లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం నగరంలోని నవోదయకాలనీ శ్మశానవాటికను డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్యలతో కలిసి మేయర్ పరిశీలించారు. శ్మశానవాటికలో వీధిలైట్ల ఏర్పాటుతో పాటు ముళ్లపొదల తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు. మట్టిరోడ్డుల స్థానంలో సీసీ రోడ్లు వేస్తామన్నారు.

జిల్లా జైలు సందర్శన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. జైలు ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల ఆహారం, నివాసం, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. జైలు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ హోమ్‌ను సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో శివబాలయోగి మహరాజ్ జన్మతిథి

అనంతపురం కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శివబాలయోగి మహరాజ్ జన్మతిథిని శుక్రవారం నగరశివారులోని శివబాలయోగి ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు భక్తులచేతుల మీదుగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కలవల మల్లికార్జున ప్రసాద్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, మహేష్‌బాబు, గోపాలకృష్ణ, శ్రీనివాసగుప్త, భక్తులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల పంపిణీ

రాప్తాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ అధికారులు వైద్య పరికరాలు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారు ఆరోగ్యకేంద్రానికి ఒక వార్మర్, ఆపరేషన్ థియేటర్ టేబుల్, స్టీల్ స్ట్రెచర్‌ను ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కృష్ణ శుక్రవారం అందించారు. వైద్యాధికారి శివకృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండు నెలలకు రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల స్వయం ఉపాధి కోసం రూ.2.50 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా 250 మందికి రుణాలు ఇవ్వనున్నారన్నారు. అలాగే రూ.2.34 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేశారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థి మృతికి కారణమైన నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఐఓ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల నుంచి ఫీజులు వసూళ్ల చేసే శ్రద్ధ వారి ప్రాణాలను కాపాడటంపై చూపడం లేదన్నారు. ఆర్ఐఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గిరి, ఎన్ఎస్‌యూఐ నరేష్, ఏఐఎస్‌బీ పృథ్వీ, సురేష్



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, వినోద్, సిద్ధు, మహేష్, మంజునాథ్, చందు పాల్గొన్నారు.

కాలేజీ వద్ద ధర్నా: నారాయణ కళాశాలను సీజ్ చేయాలంటూ పలు సంఘాల నాయకులు ఆ కళాశాల వద్ద నిరసన తెలిపారు. సమాజ్‌వాది స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ యాదవ్, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు అమర్ యాదవ్ నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థి మరణించినా కళాశాలపై చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, సతీష్, ఎర్రిస్వామి, శివుడు, సాయి తేజ, చిదానంద, హరి పాలొన్నారు.

గార్లదిన్నె: నారాయణ కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి చరణ్ ఫీజు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడితో మనస్థాపం చెందిన ఆత్మహత్య చేసుకోవడాన్ని ఆయన ఖండించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియను కళాశాల యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంజనేయులు, కుళ్ళాయిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రకు ఘన నివాళి



పరిటాల రవీంద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దివంగత పరిటాల రవీంద్ర వర్ధంతిని నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌లు పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, గౌస్‌మొయిద్దీన్, రాయల్ మురళీ, ముంటిమడుగు కేశవరెడ్డి, గంగారామ్, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, కూచి హరి, స్వామిదాస్, సంగా తేజస్విని, ఇస్మాయిల్, కృష్ణకుమార్, మణికంఠ బాబు, లింగారెడ్డి, నెట్టెం బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నారాయణస్వామి, తిరుపాలు

● అనంతపురంరూరల్: మాజీ మంత్రి పరిటాల వర్ధంతిని పురస్కరించుకుని వెంకటాపురంలో ఆయన ఘాట్‌కు రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు మారినేని నారాయణస్వామి నివాళి అర్పించారు. ఆయన వెంట వెంకటరాముడు, సజ్జల కాలువరాము, డా.బీఆర్ అంబేడ్కర్ కురుగుంట గురుకుల కళాశాల చైర్మన్ మన్నల తిరుపాలు, ధర్మేంద్ర, బ్రహ్మ ఉన్నారు.

సిండికేట్ నగర్‌లో జింకాసూర్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు, పరిటాల రవీంద్ర విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

● రాప్తాడు: పరిటాల రవీంద్ర వర్ధంతిని మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీఆర్, రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: దివంగత పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాడెం సూర్యనారాయణరెడ్డి, చెన్నకేశవులగౌడ్, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

● రామగిరి:మండలంలోని శ్రీహరిపురంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలవేసి గ్రామస్థులు నివాళి నివాళులర్పించారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. పరిటాల భవన్‌లో రవీంద్ర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నెట్టెం వెంకటేష్, యాతం పోతలయ్య, సుధాకర్‌చౌదరి, ముకుందనాయుడు, సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

● నార్పల: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. సాగునీటిసంఘం అధ్యక్షుడు ఆలం నాగార్జున నాయుడు, ఎర్రినాగప్ప, లక్ష్మీనారాయణ, చంద్రబాబు, పాల్గొన్నారు.

● ఆత్మకూరు: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పరిటాల రవీంద్ర వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాసులు, శశాంక చౌదరి, మనోరంజన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

చరణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



చరణ్ తండ్రి వెంకటనారాయణను పరామర్శిస్తున్న సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నారాయణ కాలేజీలో ఆత్మహత్య చేసుకున్న చరణ్ కుటుంబాన్ని ఆ విద్యాసంస్థల యాజమాన్యంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బత్తలపల్లిలోని చరణ్ నివాసానికి చేరుకుని తండ్రి వెంకటనారాయణను పరామర్శించారు. రాంభూపాల్ మాట్లాడుతూ అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు దుఃఖం మిగిలిస్తున్న కాలేజీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో ఫీజులు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థి చరణ్‌ను నిలబెట్టడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. కళాశాలకు కనీసం రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా అనికూడా పరిశీలించకుండా అనుమతిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్, జిల్లా కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు దామోదర్, ఎస్కేయూ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, మోహన్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు ముమ్మరం చేయండి

● అధికారులకు మున్సిపల్ ఛైర్మన్ జేసీపీఆర్ సూచన


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెండింగ్ పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని, ఎవరైనా చెల్లించకపోతే.. వారి ఇంటికి తాగునీటి కొళాయి, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో దాదాపు రూ.4కోట్ల మేర ఇంటిపన్నులు, కొళాయి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు, ప్రభుత్వానికి సంబంధించిన బిల్డింగుల పన్నులు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్ పడ్డాయన్నారు. ఇప్పుడు వాటి వసూలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా చెల్లించకపోతే వారి ఇంటికి సంబంధించి కొళాయి కనెక్షన్, కరెంట్ తొలగించాలన్నారు. అప్పుడు బకాయిలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఒకటికి రెండుసార్లు చెప్పి చూడాలని, అప్పటికీ వినకుంటే ఈ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్వో రవిబాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 22మంది ఎంపిక

గుంతకల్లుటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 22మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. రాష్ట్ర నైపుణ్యా అభివృద్ధి సంస్థ, జిల్లాఎంప్లాయిమెంట్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, సిడాప్, కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బాజ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 45 మంది నిరుద్యోగులు హాజరుకాగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు.

సర్ సీవీ రామన్ కళాశాలలో జాబ్‌మేళా

తాడిపత్రి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపాలెంలో ఉన్న సర్‌సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. ఇందులో స్విఫ్ట్ సపోర్ట్, జేబీఎం, గ్రోఎంఎన్‌సీ, జొమాటో కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని అన్నారు. దాదాపు 303మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. అందులో 90మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రమణ, సీడాప్ కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

కూడేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లను నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శైలజ ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి నెలాఖరికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. డీఈ హనుమప్ప, ఏపీఓ తులసీ ప్రసాద్, ఏసీ రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై తనిఖీ

శెట్టూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో గత రెండు రోజులుగా విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై శుక్రవారం సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యతగా లేదని విద్యార్థులు తెలిపారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు, లైట్లు వేయించాలని విద్యార్థులు కోరినట్లు చెప్పారు. తనిఖీ పూర్తి చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. తనిఖీ అధికారులు ఎర్రిస్వామి, అశోక్, లక్ష్మీనారాయణమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

బెళుగుప్ప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రస్తా విషయంపై రైతుల ఆందోళన

గుత్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పత్తికొండ రహదారిలో సాయిడిగ్రీ కళాశాల పక్కన ఉన్న రస్తాను ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం రైతులు ఆ ప్రాంతంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఈ దారి గుండా సూరసింగనపల్లి గ్రామానికి చెందిన వంద ఎకరాలకు పైగాక భూములు ఉన్నాయని, వాటిల్లో దశాబ్దాలుగా పంటలు సాగుచేస్తున్నామని తెలిపారు. కాగా కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన ఉన్న భూములను కొనుగోలు చేసి హోటల్ నిర్మాణం చేపడుతున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ కోరారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కట్టడాలను కూల్చేందుకు ప్రయత్నం చేశారు. పరిస్థితి ఆందోళన కరంగా మారడంతో ఎస్ఐ సురేష్, రెవెన్యూ అధికారులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. సదరు స్థలం కొనుగోలు చేసిన యజమానితో మాట్లాడారు. వారం రోజులు గడువు తీసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని వారికి ఎస్ఐ సూచించారు. లేనిపక్షంలో చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలను హెచ్చరించారు. దీంతో ఆందోళన విరమించారు.

సజావుగా మండల సమావేశం

యాడికి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన జరిగిన మండల సమావేశం సజావుగా సాగింది. ఇందులో ఎంపీపీ మాట్లాడుతూ స్థానికంగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వివిధ సమస్యల్ని అధికారుల దృష్టి కి తెచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 హసీనాబేగం, వైస్ ఎంపీపీ-2 చెన్నప్ప, ఎంపీడీఓ వీరరాజు, తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్, డాక్టర్ పరమేశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, ఈఓపీఆర్‌డీ శశికళ, వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారులు గైర్హాజరు..

కుందుర్పి: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి అధికారులు కరువయ్యారు. 24 శాఖల అధికారులు హాజరవ్వాల్సి ఉండగా.. చాలామంది గైర్హాజరయ్యారు. కిందిస్థాయి ఉద్యోగులు మాత్రమే హాజరవడంతో ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తేలేకపోయారు. వచ్చిన అరకొర అధికారులకే సభ్యులు తమ సమస్యల్ని విన్నవించారు. ముఖ్యంగా వచ్చే వేసవిలో గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీశంకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ రాధాస్వామి, వైద్యాధికారి అనూష దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ మారుతి, ఎలక్ట్రికల్ ఏఈ జయకృష్ణ అధికారి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.

మామపై కత్తితో దాడి

శెట్టూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైరేవు గ్రామంలో శుక్రవారం అన్నదమ్ములైన బోయ శివశంకర, బోయ రంగస్వామి గొడవపడుతుండగా.. మాయదార్లపల్లి కి చెందిన మామ బోయ ఆంజనేయులు అడ్డు వచ్చాడు. దీంతో కోపోద్రిక్తుడైన అల్లుడు రంగసామి అతడిపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన రామాంజనేయులును వెంటనే శెట్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ రాంభూపాల్ యాదవ్‌కు వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని అన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో వెలసిన పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆలయ కమిటీ ఛైర్మన్ దేవినేని అవినాష్‌తో కలిసి శుక్రవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలను వైభవంగా జరపాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పరిటాల రవీంద్రకు ఘన నివాళి


పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ జితేంద్రగౌడ్

గుంతకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని పట్టణంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పాల మల్లికార్జున, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, యూ ప్రభాకర్, రంగన్న, వై సుధాకర్, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, ఆటో ఖాజా, పెంచలపాడు వెంకటేశులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: రామగిరి మండలం వెంకటాపురంలో ఉన్న పరిటాల రవీంద్ర ఘాట్‌వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్‌గౌడ్, గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, నాయకులు ముక్కన్నగారి రామాంజనేయులు, కురువ చంద్రశేఖర్, రంగా, పీకేసీ శ్రీనివాసులు, బూషి, సురేంద్ర, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: వెంకటాపురంలోని పరిటాల రవి ఘాట్ వద్ద మండల టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, నాయకులు లక్ష్మయ్య, ఆదినారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

పామిడి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ , తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యులు జింకల సంజీవకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మా మోహన్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి వడ్డే శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

జడ్ వీరారెడ్డికి ఘన నివాళి


గుత్తిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జడ్‌వీరా రెడ్డి కాలనీలో శుక్రవారం కమ్యూనిస్టు నేత జడ్.వీరారెడ్డి వర్ధంతిని సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నిర్మల , నాయకులు పోతులూరు రేణుకమ్మ, కవిత, రేవతి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కమ్యూనిష్టు నేతలు జెడ్ వీరారెడ్డి, ఆంజనేయులు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డీ.శ్రీనివాసులు, బీ.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు సాకే నాగరాజు, రంగమ్మ, సురేంద్రబాబు, జగదీష్, అబ్దుల్లా, షబ్బీర్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే మహిళా సాధికారత

● జాతీయ బాలికా దినోత్సవంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ

గుత్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికా విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వనజా అక్కమ్మ తెలిపారు. పట్టణంలోని ఏపీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ బాలికలకు విద్య తప్పనిసరి అని తెలిపారు. తల్లిదండ్రులు బాలురతో సమానంగా బాలికలను చదివించాలని సూచించారు. బాలికావిద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని చెప్పారు. అనంతరం నిర్వహించిన సదస్సులో బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై, బాల్యవివాహాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణసమితి ప్రొటెక్షన్ అధికారి మంజునాథ్, సంరక్షణ అధికారి వెంకటేశ్వరి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణామాచారి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, పాఠశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోవిందవాడలో పొలంబడి

బొమ్మనహాళ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రాయదుర్గం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మనాయక్ పాల్గొని ఓ రైతు సాగు చేసి పప్పుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతుల పట్ల రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పర్యావరణ అనుకూల సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. అవసరమైన మేర మాత్రమే రసాయనిక ఎరువులు, పురుగు మందులువాడాలన్నారు. అధిక దిగుబడులు సాధించడం పట్ల అవగాహన కల్పించారు. ఏఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్‌దారుల అవస్థలు

● సచివాలయాల సిబ్బంది నిర్వాకమే కారణం

గుంతకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపులో పింఛనుదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పింఛన్‌కు అనర్హులను గుర్తించేందుకు గాను ప్రభుత్వం వికలాంగుల వికలత్వాన్ని పునఃపరీక్షించేందుకుగాను ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపును ప్రారంభించింది. ఇందుకు తొలిరోజు మున్సిపల్ పరిధిలోని 148 మంది, గ్రామాల నుంచి 46 మంది పింఛన్‌పొందుతున్న వికలాంగులు వచ్చారు. ఆప్తమాలజిస్టు, ఆర్థోపెడిక్ తదితర స్పెషలిస్టు వైద్యులు సచివాలయాల ద్వారా జారీచేసిన మెమో, పింఛన్‌దారుల వద్ద ఉన్న వికలాంగ ధృవీకరణ పత్రాలను అనుసరించి పరీక్షలను నిర్వహించారు.

సచివాలయాల సిబ్బంది తప్పిదం..

పట్టణంలోని పలు సచివాలయాలలో పింఛనుదారులకు ఒక సమస్య ఉంటే, మరొక పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సిందిగా తెలుపుతూ మెమోను జారీచేశారు. శ్రీరాములు అనే పింఛనుదారుడికి కంటి సమస్య ఉంటే, అతడిని ఆర్థోపెడిక్‌తో వికలత్వ శాతాన్ని ధృవీకరించుకోవాలంటూ మెమోను ఇచ్చారు. అలాగే విజయలక్ష్మి అనే పింఛనుదారుకు బుద్ధిమాంద్యం ఉంటే, కంటి పరీక్ష చేయించుకోవాలంటూ మెమోను జారీచేశారు. అదేవిధంగా ఇంకో పింఛనుదారుడికి చేయి సచ్చుబడిపోగా.. అంధత్వ పరీక్షను నిర్వహించుకోవాలని మెమో ఇచ్చారు. దీంతో పింఛనుదారులు ఇబ్బందులకు లోనయ్యారు. చివరికి వీరికి వైద్య పరీక్షలు నిర్వహించలేదు. వీరుకాక మరో 13 మందికి ఇలాంటి సమస్యే ఎదురుకావడంతో వారిని ఇతర ప్రాంతాల్లో పరీక్షలకు పంపివేశారు. దీంతో నికరంగా 178 మందికి వికలంగత్వ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. శనివారం, సోమవారం కూడా ఉరవకొండ, విడపనకల్లు, తదితర మండలాల పింఛనుదారులకు వికలత్వ పరీక్షలను నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

గుత్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని ఓ పాఠశాల ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులైన శంకరాచారి, లక్ష్మీరత్నమ్మ దంపతుల కుమారుడు లోకేష్ శుక్రవారం మధ్యాహ్నం రోడ్డుదాటుతుండగా అతివేగంగా వచ్చి నబైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో చోరీ

బెళుగుప్ప, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎలగలవంక కొత్త కాలనీలో ఉన్న గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అర్చకులు ఉదయం పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లగా ఆభరణాలు కనిపించకపోవడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ శివ తమ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. రెండు బంగారు మంగళసూత్రాలు, ఒక కిలో వెండి మకరం ఆభరణం దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాళాపురంలో పోలీస్ పికెట్

విడపనకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురంలో శుక్రవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో 10 మందికి పైగా స్వల్పగాయాలయ్యాయి. టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు ఒకరి పై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా కోపోద్రిక్తులైన ఇరువర్గాల వారు శుక్రవారం ఉదయం మళ్లీ ఒకరి ఇంటిపై మరొకరు దాడులకు దిగారు. స్పందించిన పోలీసులు ఇరువర్గాలను చెదర గొట్టి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇందులో ఉరవకొండ సీఐ చిన్నగౌస్, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూర్, పాల్తూరు, ఎస్ఐలు ఖాజా హుస్సేన్ జనార్ధన నాయుడు, నాగస్వామి, మురహరి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

రాయదుర్గం రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి వద్ద ఏర్పాటు చేసిన గౌసిద్ధేశ్వర స్టీల్ ప్లాంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ మృతి చెందిన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, సీపీఐ నాయకులు దుర్గన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ స్టీల్ ప్లాంట్ ఎదుట గంటపాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొట్రేష్ మాట్లాడుతూ.. ఐదునెలల క్రితం గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన నాగరాజు ఫ్యాక్టరీ వద్ద పనిచేస్తూ మృతి చెందాడన్నారు. కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పిన ఫ్యాక్టరీ యాజమాన్యం కేవలం రూ. 30 వేలు చెల్లించి చేతులు దులుపేసుకున్నట్లు ఆరోపించారు. వెంటనే ఆకుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మృతుడి కుమారుడు ప్రవీణ్, బంధువులు, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు పార్వతి, నాగరాజు, దుర్గన్న, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి అంజికుమార్, తాలూకా కోశాధికారి నవీన్, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మా కాలనీలో సీసీ రోడ్డు వేయకండి

● సుంకులమ్మ కాలనీ వాసుల ఆందోళన


జాతీయ రహదారిపై బైఠాయించిన కాలనీవాసులు

విడపనకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుంకులమ్మ కాలనీలో అప్పటికే ఉన్న సీసీ రోడ్డుపై కాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు వేస్తుండగా.. ఆ కాలనీవాసులు పనులను అడ్డుకున్నారు. రెండు నెలల క్రితమే సీసీ రోడ్డు పనులు చేపట్టగా.. కాలనీ వాసులు అడ్డుకున్నారు. అప్పటికి పనులు నిలిపేసిన కాంట్రాక్టర్ మళ్లీ శుక్రవారం చేపట్టగా.. కాలనీవాసులు ఆగ్రహించి రెండో సారి కూడా అడ్డుకున్నారు. అనంతరం పోలీసుల సూచనతో వారు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తమ కాలనీలో సీసీరోడ్డు పనులు చేపట్టరాదంటూ తహసీల్దార్ చంద్రశేఖరయ్యకు వినతి పత్రాన్ని అందించారు. దీంతో తహసీల్దార్ విషయాన్ని తెలిసేందుకు ఎంపీడీఓకు, ఈఓఆర్డీకి, పంచాయతీ కార్యదర్శికి, మిగిలిన శాఖల అధికారులకు ఫోన్ చేయగా ఎవరూ అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయనే వచ్చి పనులను ఆపే ప్రయత్నం చేయగా.. టీడీపీ మండల నాయకుడు ఒకరు ఫోన్ చేయడంతో మిన్నకుండిపోయారు. ఇక కాలనీ వాసులందరూ పంచాయతీ కార్యాలయం చేరుకుని అక్కడ పంచాయతీ కార్యదర్శి కోసం ధర్నా చేశారు. కాలనీవాసులు వస్తున్న విషయం తెలుసుకున్న కార్యదర్శి అక్కడి నుంచి వెళ్లి పోయి సెల్ స్విఛాఫ్ చేసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఏఒక్కరూ స్పందించక పోవటంతో ఆగ్రహానికి గురైన కాలనీ వాసులు స్థానిక 42వ జాతీయ రహదారిపైకి చేరి రాస్తారోకో చేపట్టారు. స్పందించిన ఎస్ఐ ఖాజా హుస్సేన్ కాలనీ వాసులతో చర్చించారు. దీంతో వారు మాట్లాడుతూ.. రోడ్డు పనులు చేపట్టకండి అని చెప్పినా సర్పంచ్ వినకుండా పనులు చేయిస్తున్నారని అన్నారు. సీసీ రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేయటం ఏమిటని ప్రశ్నించారు. కాలనీలో అందరం కలిసి కట్టుగా జీవిస్తున్న మేము సీసీ రోడ్డు విషయంలో రెండు వర్గాలుగా విడిపోయే ప్రమాదముందన్నారు. అందుకే సీసీ రోడ్డు వద్దు అంటున్నా అధికారులు, సర్పంచ్ వినడం లేదని మండిపడ్డారు. ఈ రోడ్డుతో మురుగునీటి సమస్య నెలకొంటుందన్నారు. సీసీ రోడ్డు పనులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ న్యాయం చేస్తామని తెలిపినా కాలనీవాసులు ససేమిరా అంటూ భీష్మించారు. చివరికి ఎస్ఐ తన సిబ్బందితో రాస్తారోకో చేస్తున్న వారిని రోడ్డుపై నుంచి చెదరగొట్టారు. అయినా వారు రోడ్డు పనులు ఆపేంత వరకూ ఆందోళన ఆపేది లేదంటూ అధికారుల ఎదుటనే ఆందోళన చేశారు.

రెండు బైక్‌లు దగ్ధం

గుంతకల్లుటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అంజలినగర్‌లో నివాసముంటున్న చంద్ర అనే వ్యక్తికి చెందిన రెండు బైక్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. చంద్ర టైలర్ పని చేస్తున్నారు. గురువారం రాత్రి ఇంటి ముంగిట హోండా షైన్, హోండా యాక్టివా ద్విచక్రవాహనాలను నిలిపారు. కాగా అర్ధరాత్రి 2.30గంటల సమయంలో శబ్దం రావడంతో అతను బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనాలు దగ్ధమవుతున్నాయి. రెండు బైక్‌లు పూర్తిగా కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతోనే ఇలా జరిగిందని బాధితడు తెలిపారు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని వాపోయారు. ఈ విషయంపై శుక్రవారం కసాపురం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి


మిద్ది రామకృష్ణ (ఫైల్)

కూడేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరులో కౌలు రైతు మిద్ది రామకృష్ణ (37) గుండెపోటుతో మృతి చెందాడు. రామకృష్ణ రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగుకు మడిని సిద్ధం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి పొలంలోనే పని చేశాడు. సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసి బయటకు వెళుతుండగా.. ఒక్కసారిగా ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తల్లి లక్ష్మక్క భోరున విలపిస్తూ కొడుకు వద్దకు పరుగులు తీసింది. అమ్మా గుండెలో నొప్పి వస్తోందంటూ చెప్పడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. గమనించిన మరో ఇద్దరు కుమారులు పరంధామ, ఆనంద్ వెంటనే వచ్చి రామకృష్ణను ఆటోలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, రెండు నెలల కుమార్తె ఉంది.

మహిళ ఆత్మహత్య


మృతి చెందిన శైలజ

యాడికి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు వద్ద నున్న సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాల జిల్లా అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన చుక్కలరెడ్డి సాగర్‌సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రాసెస్ సెక్షన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య శైలజ (39), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన శైలజ శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. సమాచారం తెలియగానే సంఘటనా ప్రదేశానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

తాడిపత్రి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా సబ్‌రిజిస్ట్రార్ భార్గవ్‌యాదవ్ శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను, ప్రస్తుతం జరుగుతున్న రిజిస్ట్రర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బంది ఎవరెవరు ఏఏ పనులు నిర్వహిస్తున్నారని, రోజూ ఎన్ని రిజిస్టర్‌లు జరుగుతున్నాయని స్థానిక అధికారులను ఆరాతీశారు. డబుల్ ఎంట్రీలు, దొంగ రిజిస్టర్‌లుజరుగుతున్నట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కౌన్సిల్‌మీట్

తాడిపత్రి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ మీట్ నిర్వహించనున్నట్లు కమిషన ర్ శివ రామకృష్ణ తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.